క్లుప్తంగా

సీఎంఓకు సన్మానం



కిరణ్ రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధానాస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్‌ను గురువారం సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎం సెక్యూరిటీ లక్ష్మీనారాయణ, ఏజీఎం గోనె శ్రీకాంత్, మాల కొండయ్య, చంద్రశేఖర్‌రావు, సీహెచ్ నాగరాజు, సుమన్ పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌డీ జీఎంకు..



రఘుపతిని సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ హెచ్‌ఆర్‌డీ జీఎంగా బాధ్యతలు చేపట్టిన గుంజపాడుగు రఘుపతిని గురువారం ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కార్మికులకు సంబంధించిన శిక్షణను త్వరగా పూర్తి చేయాలని, అప్రెంటిస్ చేస్తున్న అభ్యర్థుల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. స్పందించిన జీఎం వీలైనంత త్వరలో ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారం అయ్యేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, ఆల్బర్ట్, కార్పొరేట్ ఉపాధ్యక్షుడు పీతాంబరం, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, అభిషేక్, విప్లవరెడ్డి, గోపు కుమారస్వామి, ఎస్‌కే గౌస్, నాగుల శంకర్, ఆదాం రాజు, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే..

ఇల్లెందు: హెచ్‌సీయూలో విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయటం పట్ల సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పట్టణ కార్యదర్శి షేక్ యాకుబ్ షావలీ అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఇల్లెందులో జరిగిన మాస్‌లైన్ పట్టణ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో 400 ఎకరాల భూమిని లాక్కుని రియల్ ఎస్టేట్‌కు విక్రయించే ప్రయత్నాలు గర్హనీయమన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో విద్యార్థుల మీద లాఠీచార్జ్ సర్వసాధారణమైన అంశంగా మారిందన్నారు. ఎమర్జెన్సీని పెట్టిన కాంగ్రెస్‌కు లాఠీచార్జ్ లెక్క కాదన్నారు. ఈ సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని కోరారు.

బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు రాసేందుకు అవకాశం

ఇల్లెందురూరల్: డిగ్రీలో అన్ని కోర్సులకు సంబంధించి సెమిస్టర్లకు బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులకు కాకతీయ యూనివర్సిటీ అవకాశం కల్పించిందని ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య గురువారం తెలిపారు. 1, 3, 5 సెమిస్టర్లలో బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులు ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించే పరీక్షలు రాయవచ్చని, ఏప్రిల్ 11 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. సబ్జెక్టుల వారీగా పరీక్ష ఫీజు వివరాలను కళాశాలలో ప్రదర్శించారని చెప్పారు. బ్యాక్‌లాగ్ ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విచారణ జరిపించాలి

ఇల్లెందు: ఏపీలోని రాజమండ్రి ప్రాంతంలో రోడ్డు ప్రమాదం పేరుతో పాస్టర్ ప్రవీణ్‌ను దారుణంగా హత్య చేశారని, ఈ సంఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేస్తున్నారని, తక్షణమే ఈ సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని మాల మహానాడు డిమాండ్ చేసింది. గురువారం ఇల్లెందులో సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు కాలే పుల్లయ్య మాట్లాడుతూ.. మైనార్టీల బతుకు కష్టంగా మారిందన్నారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ సమానత్వం లేకుండా పోతోందన్నారు.

స్విమ్మింగ్ పూల్ ప్రారంభం



ప్రారంభిస్తున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను ఏరియా జీఎం వి.కృష్ణయ్య గురువారం ప్రారంభించారు. వేసవికాలంలో విద్యార్థులు, యువకులు, సింగరేణీయులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయా మం అవసరం అన్నారు. ఈత ద్వారా మానసికోల్లాసం, శరీర ధృడత్వం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సింగరేణి అధికారులు రవికుమార్, మహేష్, బి.నాగేశ్వరరావు, యూనియన్ నేతలు నజీర్ అహ్మద్, జే.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రయాణికుల అవస్థలు

- ఆధునికీకరణకు నోచుకోని ఇల్లెందు బస్టాండ్
- దాహార్తితో అల్లాడుతున్న ప్రయాణికులు
- అడ్డాగా మార్చుకున్న ప్రైవేటు వాహనదారులు

ఇల్లెందు: ఇల్లెందు ఆర్టీసీ బస్టాండ్ అధునికీకరణకు నోచుకోవటం లేదు. 1981 ఏప్రిల్ 9న ఆనాటి ఆర్టీసీ చైర్మన్ నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే చాపల ఎర్రయ్య ప్రారంభించారు. ఆనాటి నుంచి నేటి వరకు తాత్కాలిక మరమ్మతులతోనే కొనసాగిస్తున్నారు. ఎవరికీ అధునికీకరణ ఆలోచనే రావడం లేదు. కనీసం బస్టాండ్‌లో ప్రయాణికుల దాహం తీర్చే నీటి సదుపాయం కూడా లేదు. దాతలు ఏర్పాటు చేసిన ఫ్రిజ్ మినహా సంస్థ నుంచి ఏర్పాట్లు లేవు. కేవలం మున్సిపల్ నల్లాలకు పరిమితం అవుతున్నారు. అది ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. ఇక ఓ మూలకు ఒక ఆర్‌ఓ ప్లాంట్ ఓ దాత అందించింది ఉన్నా చెత్తా చెదారం వేసే చోట దానిని అమర్చారు. దీంతో ప్రయాణికులు అటుగా వెళ్లడం లేదు.

ప్రైవేటు వాహనదారులకు అడ్డా..

బస్టాండ్ ప్రైవేటు వాహనాలకు పార్కింగ్‌గా మారింది. బస్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను తరలించుకు వెళ్తున్నాయి. దీంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. బస్టాండ్‌కు చుట్టూ ప్రహరీ లేదు. క్రమంగా బస్టాండ్ ఆవరణమంతా ఆటోలు, మ్యాజిక్‌లు, జీపులు, లారీలతో నింపి వేస్తున్నారు. ఈ వాహనాలకు బస్టాండ్ ఆవరణే అడ్డాగా మారింది. అసలే ఇరుకు ప్రదేశం, ఆపై ప్రైవేటు వాహనాలు అడ్డాగా పెట్టి ఇష్టారాజ్యంగా రోడ్డు మీద వాహనాలు నిలపడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

ప్రయాణికులకు సౌకర్యాలు అంతంతే..

ఇల్లెందు బస్టాండ్‌లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లకు నీటి కరువు. బస్టాండ్ ముందు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లే అవుట్, ఇన్ బోర్డులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, గుండాల, మర్కోడు, వరంగల్, కరీంనగర్, మహబూబాబాద్, నర్సంపేట, హైదరాబాద్‌కు ఇల్లెందు నుంచి బస్సుల రాకపోకలు సాగుతున్నాయి.



బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కలగానే ఏసీ బస్సు సర్వీసులు..

భద్రాచలం, మణుగూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఏసీ బస్సులు ఉదయం రెండు సర్వీసులు, సాయంత్రం రెండు సర్వీస్‌లు వయా ఇల్లెందు మీదుగా వెళ్లేలా మళ్లించాలని ప్రయాణికులు కోరుతున్నారు. భద్రాచలం, మణుగూరు నుంచి ప్రతీరోజు చాలా బస్సులు హైదరాబాద్ వెళ్తున్నాయి. కొత్తగూడెం నుంచి తల్లాడ, వైరా మీదుగా వెళ్లే బస్సులను వయా ఇల్లెందు మీదుగా మళ్లిస్తే కొద్ది తేడాతో దూరం ఉంటుంది. ఇల్లెందు బస్ డిపో నుంచి బస్‌ల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డీజిల్ బంక్ లేక ఇక్కట్లు..

బస్ డిపో ఏర్పాటు చేసి రెండేళ్లు కావస్తోంది. కానీ డీజిల్ బంక్ ఏర్పాటు చేయలేదు. దీనివల్ల డీజిల్ కోసం ప్రతీ బస్సు కొత్తగూడెం డిపోకు వెళ్లాల్సి వస్తోంది. డీజిల్ అందుబాటులో లేక ప్రయాణికులు సకాలంలో గమ్యానికి చేర్చలేకపోతున్నారు.



మూతపడిన బస్టాండ్‌లోని హోటల్

టీ కూడా కష్టమే..

ఇల్లెందు బస్టాండ్‌లోని హోటల్ ఎందుకు మూతపడిందో తెలియదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు టిఫిన్లు, భోజనానికి బయటకు వెళ్లి వస్తున్నారు. ఈలోపు బస్సులు వెళ్లిపోతున్నాయి. గంటల కొద్ది వేచి చూడాల్సి వస్తోంది. బస్ డిపో ఏర్పడిన తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరిగింది. డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ, మెకానిక్‌లు భోజనానికి బయటకు వెళ్లాల్సి వస్తోంది.

అన్నీ సమస్యలే..



ఇల్లెందు బస్టాండ్‌లో ప్రయాణికులకు సదుపాయాలు లేవు. గిరిజన ప్రాంతానికి తగ్గట్లు అరకొర సదుపాయాలు మాత్రమే ఉన్నాయి. కనీసం తాగునీరు కూడా దొరకవు. బస్టాండ్ చుట్టూ శానిటేషన్ సమస్య తీవ్రంగా ఉంది. బస్టాండ్‌కు అవుట్, ఇన్ బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రయాణికులు వచ్చిపోయేందుకు బస్టాండ్ ఎదుట ఇతర వాహనాలు అడ్డుగా లేకుండా చూడాలి.

– ఎం.వెంకటనర్సయ్య, పూబెల్లి

తాగునీటి సదుపాయం కల్పించాలి..



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి ఫ్రిజ్ ప్రయాణికులు వేచి ఉండే చోట పరిశుభ్రమైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలి. అపరిశుభ్రంగా ఉన్న ఓ మూలన చెత్తలో ఏర్పాటు చేశారు. దుమ్ము, ధూళి పడకుండా తగు చర్యలు తీసుకోవాలి. బస్టాండ్‌లో హోటల్ తెరిపించాలి. అధికారులు వెంటనే స్పందించి బస్టాండ్‌లో ప్రయాణికులకు అన్ని సదుపాయాలు ఉండేట్లు ఆధునీకరించాలి.

– హరిప్రసాద్ యాదవ్, ఇల్లెందు

కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయండి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ, పాల్వంచ మున్సిపాలిటీల పరిధిలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికులు, పాదచారుల దాహం తీర్చాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కమిషనర్‌ను ఆదేశించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్, పాల్వంచ కమిషనర్ అయిన సుజాతకు మంగళవారం ఫోన్ చేసి పలు సూచనలు చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కొత్తగూడెం, పాల్వంచ మీదుగా వేలాది మంది భక్తులు భద్రాచలం సీతారాముల కల్యాణ మహోత్సవానికి వచ్చి పోతుంటారని, వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరిసర గ్రామాల నుంచి వివిధ పనులపై కొత్తగూడెం జిల్లా కేంద్రానికి, పాల్వంచ పట్టణానికి వచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

బొగ్గు రవాణాలో టిప్పర్, లారీలు కీలకం

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు నుంచి ఇల్లెందు, నవభారత్, బీపీఎల్, ఐటీసీ తదితర ప్రాంతాలకు బొగ్గు రవాణా చేయడంలో టిప్పర్, లారీ ఓనర్లు, డ్రైవర్ల పాత్ర కీలకమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు కోయగూడెం ఓపెన్‌కాస్టు టిప్పర్ లారీ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చుక్కాలబోడు క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ... సింగరేణి అధికారులు, టిప్పర్ లారీ యజమానులు సమన్వయంతో పనిచేసి సక్రమంగా బొగ్గు రవాణా చేయాలన్నారు. యూనియన్‌కి అన్నివిధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య, కేటీసీ పీఓ ఎం.గోవిందరావు, నవభారత్ డైరెక్టర్లు కృష్ణారావు, ప్రసాదరావు, అశోక్, డీఎస్పీ చంద్రభాను, ఎస్‌ఐ సురేష్, యూనియన్ సభ్యులు, నాయకులు అరవ వెంకటేశ్, సురేష్, మంగీలాల్, చిట్టిబాబు, కోరం సురేందర్, రెడ్యా నాయక్, గణేష్, పోశాలు, మంగీలాల్, శ్యాం, పింగలి నరేష్, రవి పాల్గొన్నారు.



లారీ ఓనర్ల యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసుకు స్థలం ఇవ్వండి..

టేకులపల్లి: ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్ట్ ఆఫీసు నిర్మాణానికి స్థలం కావాలని సీడీపీఓ కేఎం తార కోరారు. ఈ మేరకు గురువారం టేకులపల్లిలో ఎమ్మెల్యే కనకయ్యను కలిసి మాట్లాడారు. టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల మూడు మండలాలకు కేంద్రమైన టేకులపల్లి ప్రాజెక్టుకు భవనం మంజూరైందని స్థలం లేకపోవడం వల్ల నిర్మాణం ఆగిందని, 20 గుంటల స్థలం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్థలం పరిశీలిస్తానని ఎమ్మెల్యే అన్నారు.

ఓసీ నిర్వాసితులకు న్యాయం చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష కమిటీ ప్రతినిధులు

ఇల్లెందురూరల్: సింగరేణి జేకే ఓసీ నిర్వాసిత ప్రాంత ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో 21పిట్ ఏరియా అఖిలపక్ష కమిటీ గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఇప్పటికే సింగరేణి అధికారులు నిర్వాసితులుగా గుర్తించిన వారికి జేకే-5 నిర్వాసితుల మాదిరిగా ప్యాకేజీ ఇవ్వడంతోపాటు రెడ్‌జోన్ పరిధిలో ఉన్న వారికి సౌకర్యాలు మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి గతంలో నిర్వాసితులకు ఇచ్చిన మాదిరిగానే మెరుగైన ప్యాకేజీ ఇచ్చేలా కృషి చేస్తానని, 21పిట్ ఏరియాలో సౌకర్యాల కల్పనపై సహకరించాలని సింగరేణి అధికారులకు సూచిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, పూనెం సురేందర్, పూనెం కవిత, అబ్దుల్ నబీ, వెన్నంపల్లి శ్రీనివాస్, ఎట్టి హరికృష్ణ, సూర్నపాక సత్యనారాయణ, ధనసరి రాజు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: వేసవికాలంలో వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నానమ్మ చారిటబుల్ ట్రస్ట్ పౌండర్ గొల్లపూడి జగదీష్, వీరేంద్ర తెలిపారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో త్రివేణి–కృష్ణవేణి విద్యా సంస్థల సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, అధ్యాపకులు, నవోదయ సంస్థ అధినేత కృష్ణారావు పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో గురువారం చలివేంద్రం ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీలు ఆదూరి హరిబాబు, గోరపూడి లక్ష్మీనారాయణలు ప్రారంభించారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, సిలివేరి నరసింహారావు, గుడిమెట్ల సీతయ్య, ఎస్కే కరీముల్లా, వేముల నరసింహారావు, మోటపోతుల కృష్ణ, ఎస్కే చాంద్‌పాషా పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

పాల్వంచ: వామపక్ష విద్యార్థి సంఘాల సెక్రటేరియట్ ముట్టడి పిలుపులో భాగంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.సుజన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ వద్ద సుజన్ మాట్లాడుతూ.. సెంట్రల్ యూనివర్సిటీ భూముల్ని కాపాడాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పోరాటం చేస్తున్న క్రమలో విద్యార్థులపై లాఠీచార్జ్ సరికాదన్నారు.

ఉపాధి కూలీల వేతనం పెంచాలి



ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఉపాధి కూలీలకు రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని ఏఐయూకేఎస్ – ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకుడు బానోత్ ధర్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) – అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మా మాట్లాడుతూ.. ఉపాధి పనుల ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీటి సౌకర్యం, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఎండలు మండిపోతున్న దృష్ట్యా కూలీలకు 50 శాతం బోనస్ ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పారుపల్లి బాబూరావు, రాయల సిద్దు, వెంకటేశ్వర్లు, కల్తీ శేఖర్, లింగాల రాములు, బి.బాబు, పి.కృష్ణారావు, బానోత్ జగదీష్, కల్యాణ్, బాబు, కంగాల రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా సద్వినియోగం చేసుకోండి..

పాల్వంచ: ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా అమలవుతున్న ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా పోస్టల్ ఎస్పీ వి.వీరభద్రస్వామి అన్నారు. గురువారం స్థానిక సబ్ పోస్టాఫీసులో పోస్టల్ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. వివిధ రకాల ప్రమాదాల ద్వారా కుటుంబ బాధ్యులు మరణించినచో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడానికి పోస్టాఫీసులో అమలవుతున్న ప్రమాద బీమా సౌకర్యాన్ని ఒక సంవత్సరానికి రూ.520తో రూ.10లక్షల బీమా సౌకర్యం, రూ.749తో రూ.15లక్షలు పొందవచ్చన్నారు. ములకలపల్లికి చెందిన భాస్కర్ రామరాజు మోటార్ సైకిల్ యాక్సిడెంట్‌లో మృతి చెందడంతో రూ.10లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ మాలోతు వీరన్న, తెలంగాణ సర్కిల్ చీఫ్ మేనేజర్ భాస్కర్ నాయక్, ఖమ్మం బ్రాంచి మేనేజర్ రాజేష్, బ్రాంచి మేనేజర్ జగదీష్, ములకలపల్లి, పాల్వంచ సబ్ పోస్ట్‌మాస్టర్లు కిరణ్ కుమార్, రూబిన్, దుర్గాప్రసాద్, బండి పుల్లారావు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న వీరభద్రస్వామి

పీవీకే గనిలో డైరెక్టర్ తనిఖీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) అండ్(పా)గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5 ఇంక్‌లైన్ గనిని గురువారం ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి వివరాలపై గని మేనేజర్, ఏజెంట్లతో సమీక్షించారు. అనంతరం అండర్ గ్రౌండ్ మైన్‌లో దిగి మ్యాన్‌రైడింగ్ పనిస్థలాలను పరిశీలించారు. తదుపరి కంటిన్యూస్ మైనర్ వర్కింగ్ కండీషన్, పనివిధానాన్ని సంబంధిత అధికారులతో సమీక్షించారు. తరువాత సీఎమ్మార్ పనితీరును మెరుగుపర్చాలని, ఉత్పత్తి పెంచాలని సూచించారు. గనికి 2.5 లక్షల టార్గెట్‌ను కంపెనీ నిర్దేశించిందని, ఈ ఉత్పత్తిని కచ్చితంగా సాధించాలని, అందుకని బొగ్గు ఉత్పత్తిని పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం శాలేం రాజు, జీఎం సేఫ్టీ తివారి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, ఏజెంట్ రవీందర్, శ్యాంప్రసాద్, సలీం, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డైరెక్టర్‌ను ఘనంగా సన్మానించారు.



గనిలోకి దిగుతున్న డైరెక్టర్(పా) వెంకటేశ్వర్లు

లాంగ్ స్టాండింగ్ అధికారులపై వేటు?

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో లాంగ్ స్టాండింగ్ (10 సంవత్సరాలు) ఒకే చోట, ఒకే ఏరియా, ఒకే విభాగాలలో పనిచేస్తున్న అధికారుల వివరాలు తెలపాలని, సింగరేణి కోల్ మూవ్‌మెంట్ ఈడీ, జీఎం సీడీఎస్ అధికారి గురువారం కార్పొరేట్ ఈఈ సెల్ జీఎంకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న అధికారులపై వేటు పడనుందని కార్మికులు చర్చించుకుంటున్నారు. అదేవిధంగా గనుల వద్ద పనిచేయాల్సిన కొంతమంది వెల్ఫేర్ ఆఫీసర్లు కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్నారని వీరిని కూడా గనుల వద్దే కొంతకాలం విధులు నిర్వహించేలా సంస్థ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

దొడ్డి కొమరయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్యకు సీపీఎం నేతలు ఘనంగా నివాళులర్పించారు. గురువారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు నబీ మాట్లాడుతూ... నైజాం సర్కార్‌కు ఎదురొడ్డి పోరాడిన వీరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం అలుపెరుగని పోరాటం సాగిందన్నారు. జమిందార్, జాగీర్‌దార్ల నుంచి 10 లక్షల ఎకరాల భూమిని ప్రజలకు పంచినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, వజ్జ సురేష్, నాగరాజు, వీరయ్య, లక్ష్మీనారాయణ, యాసిన్, భిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులపై లాఠీ-చార్జ్ అమానుషం



ఇల్లెందు: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ యూత్ సభ్యులు



పాల్వంచ: అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నిరసన తెలుపుతున్న నాయకులు

ఇల్లెందు: కేసీఆర్ పాలనలో హరితహారం చేపడితే నేటి కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి పాలనలో హరిత సంహారం సాగుతోందని, తమ భూములు కాపాడుకునేందుకు ముఖ్యంగా పర్యావరణం కోసం పోరాడుతున్న హెచ్‌సీయూ విద్యార్థుల మీద లాఠీ చార్జ్ చేయటాన్ని బీఆర్ఎస్ విద్యార్థి, యువజన సంఘం తీవ్రంగా ఆక్షేపించింది.

గురువారం ఇల్లెందులో విద్యార్థి, యువజన సంఘం నేతలు కళ్లకు గంతలు కట్టుకుని ర్యాలీగా కొత్త బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం పెట్టారు. గిన్నారపు రాజేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో రావణకాండ సాగుతోందని ఆరోపించారు. నిన్న హైడ్రా పేరుతో ఇళ్లు కూలగొట్టి, నేడు హెచ్‌సీయూలో 400 ఎకరాలు యూనివర్సిటీ భూములు లాక్కుని పర్యావరణం ధ్వంసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, కాసాని హరిప్రసాద్ యాదవ్, భూక్యా సురేష్ నాయక్, కొంటు రవికాంత్, నీలం రాజశేఖర్, లలిత్ కుమార్ పాసీ, చాంద్‌పాషా, నిఖిల్, ఇమ్రాన్, వైకుంఠం, శ్రీరామ్, రామకృష్ణ, ఇంతియాజ్ పాల్గొన్నారు.

పాల్వంచ: హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సింధు తపస్వీ అన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సింధు తపస్వీ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా వెళ్తోందని, యూనివర్సిటీని అభివృద్ధి చేయాల్సింది పోయి, దాని ఉనికికే ప్రమాదం తెస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో హసబీబ్, రాజేష్, అబ్దుల్, అఖిల్, లకేష్, గణేష్, విజయ్, రోహిత్, సాయి చరణ్, సాయి, వినయ్ పాల్గొన్నారు.

నిరసన... హైదరాబాద్‌లో హెచ్‌సీయూ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని విరమించుకోవాలని, యూనివర్సిటీ పేరునే రిజిస్ట్రేషన్ చేయించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు మంకెన వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, జిల్లా నాయకులను ఖమ్మంలో పోలీసులు చేసిన అరెస్టులకు ఖండిస్తూ మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడు గ్రామంలో నల్లజెండాలతో నిరసన తెలిపారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసుల్ని ఎత్తివేయాలన్నారు. భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టొద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.శ్రీను, కె.నాగయ్య, లాజర్, సతీష్, మల్లేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దస్తగిరి సేవలు మరువలేనివి



దస్తగిరిని సన్మానిస్తున్న స్థానికులు

పాల్వంచ: దేశ సేవలో ఎండీ దస్తగిరి సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. ఇండియన్ ఆర్మీలో వివిధ హోదాల్లో 25 సంవత్సరాల పాటు విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ అనంతరం గురువారం సొంత ప్రాంతమైన పాల్వంచకు వచ్చిన సందర్భంగా స్థానిక దమ్మపేట సెంటర వద్ద డీపీఎక్స్ ఫ్రెండ్స్, యూత్ ఆధ్వర్యంలో అభినందన, సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ... దేశ రక్షణే తన ఊపిరిగా భావించి విధుల్లో ఎంతో ధైర్యసాహసాలతో, ఉన్నతాధికారుల మన్ననలతో పనిచేయడం గొప్ప విషయం అన్నారు. ఇలాంటి ఆర్మీ జవాన్లకు ప్రజలంతా ఎప్పుడూ రుణపడి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంకటి వెంకటేశ్వర్లు, జాకీర్, ఫణీకుమార్‌రాజు, నరేంద్రకుమార్ రాజు పాల్గొన్నారు.